పదిలో బాలికలదే పైచేయి

- 91.31 శాతం ఉత్తీర్ణత
- గతేడాది కంటే 4.71 శాతం పెరుగుదల
- 3,927 పాఠశాలల్లో వంద శాతం పాస్
- ఆరు ప్రయివేటు బడుల్లో సున్నా ఫలితాలు
- అగ్రస్థానంలో నిర్మల్, అట్టడుగున వికారాబాద్
- జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ
- ఫలితాలు విడుదలచేసిన విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన హైదరాబాద్‌లోని ఎస్‌సిఇఆర్‌టి ప్రాంగణంలో మంగళవారం విడుదల చేశారు. ఈ ఏడాది 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది 86.60 శాతం ఉత్తీర్ణత వచ్చింది. రాష్ట్రంలో పదో తరగతి ఫలితాల్లో గతేడాది కంటే ఇప్పుడు 4.71 శాతం ఉత్తీర్ణత పెరగడం గమనార్హం. రెగ్యులర్ విద్యార్థులు 4,94,207 మంది పరీక్షలకు హాజరుకాగా, 4,51,272 (91.31 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలురు 2,48,999 మంది పరీక్షలు రాయగా, 2,22,656 (89.42 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. బాలికలు 2,45,208 మంది పరీక్షలకు హాజరైతే 2,28,616 (93.23 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు కంటే బాలికలు 3.81 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 11,606 మంది విద్యార్థులు ప్రయివేటుగా పరీక్షలకు హాజరుకాగా, 5,772 (49.73 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఇందులో 7,583 మంది బాలురు హాజరైతే 3,594 (47.40 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 4,023 మంది బాలికలు పరీక్ష రాస్తే, 2,178 (54.14 శాతం) మంది పాసయ్యారు. ప్రయివేటు విద్యార్థుల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. బాలురు కంటే బాలికలు 6.74 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు, సమగ్ర శిక్ష డైరెక్టర్ మల్లయ్య బట్టు, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి, పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు సిహెచ్ రమణకుమార్, లింగయ్యతోపాటు ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు విజయభారతి, శ్రీనివాసరావు, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాలను విడుదల చేస్తున్న బుర్ర వెంకటేశం తదితరులు

తెలంగాణ గురుకులాల్లో 98.71 శాతం ఉత్తీర్ణత

పదో తరగతి ఫలితాల్లో రెగ్యులర్ విద్యార్థులకు సంబంధించి 3,927 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి. ఈసారి ఆరు పాఠశాలల్లో 'సున్నా' ఫలితాలొచ్చాయి. తెలంగాణ గురుకుల పాఠశాలలు 98.71 శాతంతో అత్యధిక ఉత్తీర్ణతను నమోదు చేశాయి. తెలంగాణ గురుకులాలు, బిసి, ఎస్‌సి, గిరిజన, మైనార్టీ గురుకులాలతోపాటు మోడల్ స్కూళ్లు, ప్రయివేటు పాఠశాలలు, కెజిబివిలు రాష్ట్ర సరాసరి ఉత్తీర్ణత 91.31 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణతను నమోదు చేశాయి. ఆశ్రమ పాఠశాలలు, ఎయిడెడ్, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్ర సరాసరి ఉత్తీర్ణత 91.31 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణతను సాధించాయి.

99.05 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ ప్రథమం

పదో తరగతి ఫలితాల్లో 99.05 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 8,908 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 8,823 (99.05 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 4,300 మంది బాలురు పరీక్షలు రాస్తే 4,246 (98.74 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 4,608 మంది బాలికలు పరీక్షలకు హాజరైతే 4,577 (99.33 శాతం) మంది పాసయ్యారు. 98.65 శాతం ఉత్తీర్ణతతో సిద్ధిపేట జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఈ జిల్లా నుంచి 13,976 మంది పరీక్షలు రాయగా, 13,788 (98.65 శాతం) మంది పాసయ్యారు. 98.27 శాతంతో రాజన్న సిరిసిల్ల జిల్లా మూడో స్థానంలో ఉంది. ఈ జిల్లా నుంచి 6,470 మంది పరీక్షలు రాస్తే, 6,358 (98.27 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 65.10 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి వికారాబాద్ జిల్లా పదో తరగతి ఫలితాల్లో అట్టడుగున నిలిచింది. ఈ జిల్లా నుంచి 13,357 మంది పరీక్షలు రాయగా, 8,695 (65.10 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తు గడువు 15

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల మూడు నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామని అన్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసిన వారు ఆ ఫలితాల కోసం ఎదురుచూడకుండా ఈ పరీక్షలకు ఫీజు చెల్లించాలని కోరారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు తుది గడువు ఈనెల 16వ తేదీ వరకు ఉందని చెప్పారు. ఆలస్య రుసుం రూ.50తో ఆ సబ్జెక్టు పరీక్ష ప్రారంభానికి రెండు రోజుల ముందు వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని వివరించారు. ఫలితాలు వెల్లడించిన 15 రోజుల్లోగా అంటే ఈనెల 15 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేయాలని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసిన, డీఈవో కార్యాలయానికి సమర్పించిన దరఖాస్తులనే అంగీకరిస్తామని స్పష్టం చేశారు. ఎస్‌ఎస్‌సీ బోర్డుకు పోస్టు ద్వారా పంపిన దరఖాస్తులు ఆమోదించబోమని వివరించారు. వివరాల కోసం www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

పరీక్షలే జీవితం కాదు : బుర్రా వెంకటేశం

ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాక సుమారు పది మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. విద్యార్థులకు పరీక్షలే జీవితం కాదని చెప్పారు. జీవితంలో అవీ కూడా ఒక భాగమని వివరించారు. టెన్త్, ఇంటర్‌లో ఫెయిలై ఆ తర్వాత ఉత్తీర్ణులై జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు ఎంతో మంది ఉన్నారని చెప్పారు. ఫెయిలయ్యారని, మార్కులు తక్కువగా వచ్చాయంటూ ఆందోళన చెందొద్దని కోరారు.

BEFORE THE HON'BLE KARNATAKA APPELLATE TRIBUNAL, AT BENGALURU

APPEAL No. 351/2023

BETWEEN : 1. Sri. R. Ananda Kumar, Since deceased (12/02/2024), Rep. by his LR's

1(a). Smt. Lakshmidevi, W/o late R. Ananda Kumar, Aged about 66 years, R/at No.9, Serpentine Road, Kumara Park West, BENGALURU - 560 020.

1(b). Smt. Leena L Narayana, W/o Lakshmi Narayana, Aged about 46 years, R/at No.9, Serpentine Road, Kumara Park West, BENGALURU-560 020.

1(c). Smt. Meena A, W/o Vanith Kumar, Aged about 45 years, No.456, 8th Cross, Mahalakshmi Layout, BENGALURU-560 086.

2. Smt. R. Bhagyamma, W/o Late Vijaya Kumar Aged about 60 years, House wife, R/at 118, Anjanadri, 1st Main Road, GKV Nagar, GKVK Post, BENGALURU-560 065.

3. Sri. Prashanth V, S/o Late Vijaya Kumar, Aged about 41 years, Own Business, R/at 154, 9th Cross, KHBS Layout, Sir M Vishweshwaraiah Layout, 4th Block, Kengeri Satellite Town, Near BMK Community Hall, BENGALURU-560 056.

4. Sri Uday V, S/o Late Vijaya Kumar, Aged about 37 years, Bank Employ, R/at 118, Anjanadri, 1st Main Road, GKV Nagar, GKVK Post, BENGALURU-560 065.

5. Smt. R. Rajeswari, D/o Late O.V. Ramaiah, Aged about 67 years, House Wife, R/at No.23, 2nd Main Road, Ganganagar Extension, BENGALURU -560 032.

...APPELLANTS

AND : 1. The State of Karnataka Revenue Department

2. The Special Deputy Commissioner Bangalore Urban District and others ...RESPONDENTS

SUMMONS TO THE PROPOSED RESPONDENT NO. 10 UNDER ORDER V RULE-20 (1-A) OF THE CODE OF CIVIL PROCEDURE, 1908

Prop. R(10) : M/s Sandhya Constructions & Estates Private Limited (Formerly Known as Sandhya Hotels Private Limited) Office at Sy.No. 86, 87, 90 & 91, Sandhya Techno-1, Raidurga Main Road, Hyderabad, Rep. by its Director.

...PROPOSED RESPONDENT No. 10

WHEREAS, the Appellants have instituted the above matter against the State of Karnataka, Revenue Department and eight others for setting aside the impugned conversion order passed by the Special Deputy Commissioner / 2nd Respondent in its proceeding No. A.L.N: (N.A.Y) S R: 294/07-08 dated 15.12.2008 (Document No. 1 referred in the appeal) with respect to the land of extent 5 acres, situated at in Old Survey No. 10, New Survey No. 22/2 of Manchenahalli Village Yelahanka Hobli, Yelahanka Taluk, and grant such other relief/reliefs that this Hon'ble Tribunal may deem fit and proper in the facts and circumstances of the matter. Further during the pendency of the above Appeal you have purchased the property measuring 5 Acres of land situated as stated above from the Respondent No. 8 and 9 i.e., Godavari Bhimalli and Vivekananda by entered the alleged Sale Deed dated 08.09.2023, registered before the Senior Sub-Registrar Office, Ganganagar, Bengaluru, which is a subject matter of land of this appeal, As such in the Appeal application was filed to implead you as proposed Respondent No. 10. Since on implead application filed the notice has been issued you reflected through Postal Track that it has delivered you but not appeared in the Appeal. Therefore you are hereby notified to appear before the HON'BLE KARNATAKA APPELLATE TRIBUNAL (CH-1) at BENGALURU in person or by a pleader duly instructed on 25th June 2024 at 11.00 A.M to answer the claim and you are directed to produce on that day all the relevant documents upon which you are intended to reply in support of your defense.

Take notice that, in default of your appearance on the date before mentioned the matter will be heard and determined ex-parte in your absence.

Given under my hand and seal of the Tribunal this 29.04.2024.

By Order of the Tribunal, ಸಹಾಯಕ ನಿಬಂಧಕರು, ಕರ್ನಾಟಕ ಮೇಲ್ಮನವಿ ನ್ಯಾಯಾಧೀಕರಣ, ಬೆಂಗಳೂರು.

M.C. RAVI KUMAR, Advocate
Ravi & Ravi Advocates
No. 156/1B, 1st Floor, Opp: Karnataka Bank, R.V. Road Cross, BANGALORE - 560 004.

బిజెపి ఓటమితోనే దేశ ఐక్యత

- దేశ ఉనికికే అది ప్రమాదకరం.. అందుకే కాంగ్రెస్‌కు మద్దతు
- రఘురాంరెడ్డి గెలుపు బాధ్యత తీసుకుంటాం..
- 16 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు : తమ్మినేని
- కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోడీ : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- బిజెపి పాలనలో ప్రజల మధ్య విద్వేషాలు : మంత్రి పొంగులేటి
- అందరికి అందుబాటులో ఉంటా : అభ్యర్థి రఘురాంరెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్.

దేశ ఐక్యతకు విఘాతం కలిగిస్తూ.. రాక్షస శక్తిగా ముందుకొస్తున్న బిజెపిని ఎదుర్కొనేందుకే కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఒకే వేదికపైకి వచ్చి ఇండియా కూటమిగా ఏర్పడ్డారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో భువనగిరి పార్లమెంట్ స్థానం మినహా మిగిలిన 16 చోట్లా కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక ఎస్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సిపిఎం ఖమ్మం పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు అభ్యర్థి రఘురాంరెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు హాజరయ్యారు.

అభివాదం చేస్తున్నాతమ్మినేని వీరభద్రం, వేదికపై మంత్రులు భట్టి, పొంగులేటి, అభ్యర్థి రఘురాంరెడ్డి తదిరులు

ఎన్‌డిఏను గద్దె దించడమే లక్ష్యం: తమ్మినేని వీరభద్రం

పదేళ్ల మోడీ పాలనలో దేశానికి ప్రమాదకరంగా మారిన ఎన్‌డిఎను ఈ ఎన్నికల్లో గద్దె దించడమే ప్రధాన లక్ష్యంగా ఇండియా కూటమి ఆవిర్భవించిందని తమ్మినేని అన్నారు. బిజెపి విధానపరంగా దేశ ఉనికికే ప్రమాదకరమన్నారు. బిజెపి వెనుక ప్రజల మధ్య విద్వేషాలను రగిల్చే ఓ ఫాసిస్టు సిద్ధాంతం ఉందని తెలిపారు. భారత రాజ్యాంగంలో ముఖ్య సారాంశమైన సమానత్వాన్ని.. రూపుమాపే సనాతన మనుధర్మాన్ని బిజెపి ముందుకు తీసుకొస్తోందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అడ్డు తొలగించుకుంటే మనుధర్మాన్ని స్వేచ్ఛగా అమలు చేయాలనేదే బిజెపి వ్యూహమని తెలిపారు. ప్రతిపక్షాలే కాదు, రాజకీయ పార్టీలన్నింటినీ నిర్వీర్యం చేసి ఏకవ్యక్తి రాజ్యంలా దేశాన్ని మార్చాలని మోడీ ప్రభుత్వం చూస్తోందన్నారు. ఆర్థిక దోపిడీని విశృంఖలం చేసేందుకు పూనుకుందని తెలిపారు. రాజ్యాంగ సంస్థలు, స్వతంత్ర వ్యవస్థలను నిర్వీర్యం చేసే చర్యలతో పాటు వాక్ స్వాతంత్ర్యాన్ని సైతం హరించేలా బిజెపి వ్యవహరిస్తోందన్నారు. రాజకీయాలు వ్యాపారమయం అయ్యాయని, అధికారంలో ఉన్న పార్టీ చుట్టూ తిరిగే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని తెలిపారు. రామ సహాయం రఘురాంరెడ్డి గెలుపు బాధ్యతను సిపిఎం స్వీకరిస్తుందని, ఆయన అందుబాటులో ఉండి ప్రజాసేవ చేసేలా చూస్తామని మాట ఇచ్చారు.

దేశ రక్షణకు ఏకం కావాలి : డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క

దేశ రక్షణకు అందరం ఏకం కావాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధిష్టానం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తాను స్వయంగా సిపిఎం రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి మద్దతు కోరానన్నారు. దేశ రాజకీయ పరిస్థితుల దృష్ట్యా సంఘటితంగా వెళ్దామని ముందుకు వచ్చిన సిపిఎం నాయకత్వానికి భట్టి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సంపద ప్రజలకు చెందేలా చూడటమే కాంగ్రెస్, కమ్యూనిస్టుల లక్ష్యమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో పెడుతున్న బిజెపిని సాగనంపడమే ధ్యేయంగా ముందుకెళ్దామని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

సిపిఎం సహకారం మర్చిపోలేను : రెవెన్యూ మంత్రి పొంగులేటి

తమ్మినేని సారథ్యంలో సిపిఎం సహకారంతోనే 2014లో తాను ఎంపీనయ్యానని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ విషయాన్ని తాను ఎప్పటికీ మర్చిపోనన్నారు. అలాగే రామసహాయం రఘురాంరెడ్డికి కూడా వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. దేశంలో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నాక కామ్రేడ్లు కోరుకున్న పాలనను అందిస్తామన్నారు. అక్షింతల పేరుతో మాయ మాటలు చెప్పి బిజెపి ఓట్లు దండుకోవాలని చూస్తుందని తెలిపారు. ఈసారి ఎన్‌డిఎ కూటమిని ఇంటికి పంపి.. నూటికి నూరుశాతం 'ఇండియా కూటమి' అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సిపిఎం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, ఎం.సుబ్బారావు, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, రాయల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్

- ఆరు గ్యారంటీల్లో ఒకటీ నెరవేర్చలే
- బిజెపి, కాంగ్రెస్ రెండూ ఒకటే
- జిల్లాలో అధికంగా పోడు పట్టాలిచ్చాం
- కొత్తగూడెం రోడ్ షోలో మాజీ సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"కల్లబొల్లి మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒకటి కూడా సక్రమంగా అమలు చేయలేదు. గిరిజనులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అధికంగా పోడు పట్టాలు ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుంది" అని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కే.చంద్రశేఖర రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో జరిగిన రోడ్డు షోలో కెసిఆర్ మాట్లాడారు. గిరిజన బిడ్డలకు పాలన అందాలని కొత్తగూడెం జిల్లా ఏర్పాటు చేశామన్నారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలను తగ్గిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. జిల్లా ఉండాలా.. తీసేయాలా.. అని సభికులను కేసీఆర్ అడిగారు. జిల్లా ఉండాలంటే బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మోసపు వాగ్దానాల వల్ల రైతు బంధు, రైతు బీమా రాలేదని, తులం బంగారంతో కల్యాణ లక్ష్మి, రూ.2,500 పెన్షన్ నేటికీ అందలేదని విమర్శించారు. రైతులకు రుణం మాఫీ రూ.2 లక్షలు వచ్చిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారని, కానీ ఇప్పటికీ చేయలేదని విమర్శించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో 24 గంటలు కరెంట్ ఇచ్చామని, ఇప్పుడు కరెంట్ ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో అయోమయంగా ఉందన్నారు. రైతులకు త్రీ పేస్ కరెంట్ కోసం కోట్లు ఖర్చుపెట్టామని, ఇప్పుడు కరెంట్ కోతలతో మోటార్లు కాలుతూ రైతులు గోస పడుతున్నారని తెలిపారు. పినపాక నియోజకవర్గంలో ఉన్న చిన్న గిరిజన గ్రామానికి ఆనాడు మిషన్ భగీరథ నీళ్లు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు మిషన్ భగీరథ నీళ్లు సక్కగా రావడంలేదన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1.55 లక్ష ఎకరాల పోడు పట్టాలు ఇచ్చి, రైతు బంధు ఇచ్చామన్నారు. ఇప్పుడు పోడు రైతులకు రైతు బంధు వచ్చిందా.. అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారం చేస్తున్నారని, మతాలు, కులాల మధ్య చిచ్చులు పెట్టి ఓట్లు సంపాదించాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. 75 ఏండ్ల స్వాతంత్ర్య కాలంలో గిరిజన, ఆదివాసీలకు గుర్తింపు లేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నడిబొడ్డున కోట్ల రూపాయలతో గిరిజన భవనాలు కట్టామని, సింగరేణి బిడ్డలకు సాయం, బోనస్, స్పెషల్ ఇంక్రిమెంట్.. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సిఎం చోటే భాయ్... మోడీ బడే భాయ్ అంటూ విమర్శించారు. కేంద్రంలో 10 ఏండ్ల బీజేపీ పాలనలో ఒక్క హామీ నెరవేరలేదన్నారు. గోదావరి నీళ్లు ఎత్తుకుపోయి తమిళనాడుకు ఇస్తామని మోడీ అంటున్నారని, ఈ విషయంలో రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించాడు. సీతారామ ప్రాజెక్టు జిల్లాకు వరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం పెట్టి, ఆటో డ్రైవర్లను వీధిన పడేసిందని ఆరోపించారు. తెలంగాణ సమస్యలు, తెలంగాణ నదులు మనకు దక్కాలంటే బిఆర్‌ఎస్ గెలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభలో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు.

BEFORE THE COMMISSIONER FOR EMPLOYEES COMPENSATION CUM DEPUTY COMMISSIONER OF LABOUR-I T.ANJAIAH BHAVAN RTC 'X' ROADS AT HYDERABAD
E.C.No. 21 of 2021

Between:
P.Vinod @ Vinod Kumar ...Applicant
AND
P.Veeramani and another ...Respondents

To,
P.Veeramani W/o, P.Ramulu,
R/o, H.No: 2-168/A, Sahebguda,
Mangalapally, Ibrahimpatnam,
Ranga Reddy District - 501506
...Opp.Party No.2

Take notice that the above applicant had filed the case against you for grant of compensation for the injuries sustained by him in motor accident and the case is posted to 12-6-2024 at 3-00 PM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
M.RAJESH KHANNA
Advocate
Off: Flat No.226, Jamuna Towers,
Opp: Yashoda Hospital, Malakpet,
Hyderabad-500036.

BEFORE THE COMMISSIONER FOR EMPLOYEES COMPENSATION CUM DEPUTY COMMISSIONER OF LABOUR-I T.ANJAIAH BHAVAN RTC 'X' ROADS AT HYDERABAD
E.C.No. 32 of 2022

Between:
Rama Raut and another ...Applicant
AND
M/s. Kavya Drillers and another ...Opp. Parties

To,
M/s. Kavya Drillers
Rep by M. Srinivasulu,
R/o. D.No.2-1, Chinnakaparthi Village,
Chityal, Nalgonda Dist - 508 114.
...Opp.Party No.1

Take notice that the above applicant had filed the case against you for grant of compensation for the injuries sustained by him in motor accident and the case is posted to 12-6-2024 at 3-00 PM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
M.RAJESH KHANNA
Advocate
Off: Flat No.226, Jamuna Towers,
Opp: Yashoda Hospital, Malakpet,
Hyderabad-500036.

ఎస్‌ఎస్‌సి ఫలితాల్లో శ్రీచైతన్య విజయదుందుబి

- 1,402 మందికి 10 జిపిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థ విజయదుందుబి మోగించింది. 1,402 మంది విద్యార్థులు పదికి పది జిపిఎను సాధించారని శ్రీచైతన్య స్కూల్స్ డైరెక్టర్ సీమ చెప్పారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 9.8 జిపిఎ ఆపైన సాధించిన విద్యార్థులు 2,803 మంది, 9.5 జిపిఎ ఆపైన సాధించిన విద్యార్థులు 5,207 మంది, 9.0 జిపిఎ ఆపైన సాధించిన వారు 8,216 మంది ఉన్నారని వివరించారు. తమ విద్యాసంస్థలో 99.2 శాతం ఉత్తీర్ణత నమోదైందని చెప్పారు. వంద శాతం ఉత్తీర్ణత పొందిన తమ బ్రాంచ్‌లు 84 ఉన్నాయని అన్నారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో ఏ గ్రేడ్ సాధించిన విద్యార్థులు 17,913 మంది ఉన్నారని వివరించారు. గ్రేడ్ పాయింట్స్ అయినా, మార్కులైనా పదో తరగతి ఫలితాల్లో ఎల్లప్పుడూ శ్రీచైతన్య నెంబర్‌వన్ స్థానంలో నిలుస్తుందని చెప్పారు. ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సీ ఐపిఎల్, ఎంపిఎల్, ఐకాన్, సీబ్యాచ్, సివిల్స్, మెడికాన్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్‌లు, మైక్రోస్థాయి బోధనతోపాటు అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయుల వల్ల ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మొదటి ర్యాంకులు సాధించిన విద్యార్థులు శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులేనని అన్నారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులను ఆమె అభినందించారు.

విద్యావేత్త చుక్కా రామయ్యకు రాఘవులు పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు మంగళవారం పరామర్శించారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన రాఘవులు.. రామయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు కూడా ఉన్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేలకు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్టేషన్ ఘన్‌పూర్, భద్రాచలం ఎమ్మెల్యేగా గెలుపొంది కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావులపై అనర్హత వేటు వేసేలా అసెంబ్లీ కార్యదర్శికి ఉత్తర్వులు ఇవ్వాలనే కేసులో హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యే కెపి వివేకానంద్ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ విజయసేనరెడ్డి విచారించారు. ప్రతివాదులైన కడియం, తెల్లం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ, శాసనసభ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘాలకు నోటీసులు ఇచ్చింది. విచారణను జూన్ 5వ తేదీకి వాయిదా వేసింది. వారిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ చేసేందుకు వెళితే అసెంబ్లీలోకి అనుమతివ్వలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టు చెప్పినట్టుగా ప్రభుత్వ ప్లీడర్ ద్వారా ఫిర్యాదులను స్పీకర్ ఆఫీసుకు అందజేశామని ఎజి చెప్పారు. దీంతో హైకోర్టు ప్రతివాదులకు నోటీసులిచ్చింది.

CHANG OF FATHER NAME

I, SYED WASEEM UDDIN R/O. H.No. 17-2-1147/1, Rein Bazar, Hyderabad, Telangana. Holder of Passport No. F9709149 my father name has changed to Mohd. Naseer Uddin earlier it was Syed Naseer Uddin.

బిజెపి మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

' బిజెపి మళ్లీ గెలిస్తే దేశానికి ప్రమాదకరం.. రిజర్వేషన్లను ఎత్తేస్తారు.. 400 సీట్లలో గెలిపిస్తే రాజ్యాంగాన్నే మారుస్తామని చెబుతున్నారు.. సెమీ ఫైనల్లో కెసిఆర్‌ను ఓడించాం.. ఫైనల్లో గుజరాత్ గులాములను ఓడిస్తాం.. మోడీని గుజరాత్‌కు, బీజేపోళ్లను సూరత్‌కు పంపాలి.. బిజెపి, బిఆర్‌ఎస్ మధ్య చీకటి ఒప్పందం జరిగిందనేందుకు ఇటీవల కెసిఆర్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనం.. బిఆర్‌ఎస్ ఎప్పటికైనా బిజెపితో పోతుందని గమనించే బిజెపిని ఓడించేందుకు, దేశాన్ని రక్షించేందుకు కమ్యూనిస్టులు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారు.." అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం కరీంనగర్, వరంగల్, చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గాల్లోని జమ్మికుంట, రేగొండ, బాలాపూర్, బడంగ్‌పేట, ఆర్కేపురం, సరూర్‌నగర్ సభల్లో మాట్లాడారు. బిజెపి, . బిజెపి ఓడిపోతేనే ప్రజలు గెలుస్తారని అన్నారు. తన రాజకీయం కోసం రాముడిని, హిందూత్వాన్ని బిజెపి వ్యాపార వస్తువు చేసి ఓట్లు అడుగుతోందని, హిందూ ధర్మాన్ని అవమాన పరుస్తోందని విమర్శించారు. కల్యాణం కాకుండానే రాముడి తలంబ్రాల . కెసిఆర్ ప్రభుత్వం 10 ఏండ్లలో రాష్ట్రాన్ని విధ్వంసం అప్పుల కుప్పగా మార్చిందని, యువతను నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. అమిత్‌షాను కెసిఆర్ ఆవహించినట్టున్నారని, అందుకే గాంధీభవన్‌కు ఢిల్లీ పోలీసులను పంపిస్తున్నారని అన్నారు. తనను అరెస్టు చేయడానికి ఢిల్లీ పోలీసులు వచ్చినా, సరిహద్దులో ఉన్న సైనికులు వచ్చినా భయపడేది లేదన్నారు. హామీల గురించే అడుగుతుంటే అక్రమంగా కేసులు పెట్టాలని చూస్తున్నారని అన్నారు. గుజరాత్ పెత్తనానికి, తెలంగాణ పౌరుషానికి మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు.

GOOD NEWS TO FARMERS
MEHIN TOTAL CHEMICALS PRIVATE LIMITED
Regd.Office : #186, Old Grain Market, Mansa (Punjab)- 151505

భారత ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య ఎస్.ఓ.2900 (ఇ), తేది.24-10-2015-FCO(1985) వ్యవసాయ సహకార మరియు రైతు సంక్షేమ శాఖ ప్రకారం మేము అనగా మెహిన్ టోటల్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ క్రింది తెలిపిన 100% నీటిలో కరిగిపోయే మిశ్రమ ఎరువులను ద్రవ/ గుళికల రూపంలో దిగుమతి/ తయారు చేసి, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సరఫరా చేయగలమని తెలియజేస్తున్నాము.

N:P:K06:12:36, N:P:K10:10:30, N:P:K10:28:16, N:P:K11:00:37, N:P:K12:32:14, N:P:K13:05:26, N:P:K13:40:13, N:P:K16:08:24, N:P:K16:12:16, N:P:K18:18:18, N:P:K19:19:19, N:P:K20:20:20, N:P:K24:24:00, N:P:K26:08:11, N:P:K28:28:00

పై ఎరువులు పంటల అభివృద్ధికి మరియు అధిక దిగుబడుల కొరకు సహకరించును.

Works:- M/s. MEHIN TOTAL CHEMICALS PRIVATE LIMITED, TALWANDI ROAD, MANSA, Punjab-151505, Ph No - 01652-220067, 92108-80245, Email ID : info@mehintotalchemicals.com

Sales Office:- M/s. KARVIN AGRISCIENCE LLP, 05-055/49/C/NR, JEEDIMETLA, QUTBULLAPUR (M), MEDCHAL-MALKAJGIRI (Dist)-500055. TELANGANA Ph No - 7093900116, Email ID : karvinagriscience@gmail.com

అబద్ధాలతో మభ్యపెడుతున్న మోడీ

- ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బుక్‌లెట్ ఆవిష్కరణలో బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్ల మోడీ పాలన ముదనష్టంగా ఉందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, టి జ్యోతి, డిజి నర్సింహారావులతో కలిసి 'బిజెపి బందిఖానా నుండి దేశాన్ని విముక్తి చేద్దాం' బుక్‌లెట్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి నాయకులు, ప్రధాని మోడీ మళ్లీ మూడోసారి గెలవాలని తాపత్రయ పడుతున్నారని చెప్పారు. కానీ..వారి మాటలు, వారి చేతలు చూస్తే.. తీవ్రమైన భయాందోళనలో ఉన్నట్టు అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. అందుకే డంబాచారాలకు పోతూ, అబద్ధాలను వల్లె వేస్తూ మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ క్రమంలో బిజెపి బండారాన్ని బయట పెట్టేందుకు తెలంగాణ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రకరకాల రూపాల్లో దాని అబద్ధాల ప్రచారాన్ని ఎండగట్టాలని సూచించారు.

లోక్‌సభ ఎన్నికల్లో 370 నుంచి 400 సీట్లు గెలుస్తామని ఊదరగొట్టిన మోడీ.. ఇప్పుడా మాటలకు విరామమిచ్చారని గుర్తు చేశారు. 'మంగళసూత్రాలు కూడా గుంజుకుంటుందని, ముస్లీములకు రిజర్వేషన్లు తీసేస్తాం' అంటూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను సెంటిమెంటుతో పాటు మతోన్మాదాన్ని రెచ్చగొట్టటం ద్వారా గెలవాలనుకుంటున్నారని విమర్శించారు. కానీ ఆ పాలన ఎంత అధ్వాన్నంగా ఉందో పదేళ్ల పాలన చూస్తే అర్థమవుతోందని వివరించారు. దేశంలో మోడీ హయాంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిందన్నారు. మొత్తం మీద 20 శాతం చదువుకున్న వారు నిరుద్యోగులుగా ఉన్నారని చెప్పారు. అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లలో రూ. ఏడు వేల కోట్లకు పైబడి ఆస్తి కలిగిన బిలియనీర్ల సంఖ్య 60 మంది నుంచి 220 మందికి ఎలా పెరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. పారిశ్రామికీకరణ పూర్తిగా స్తబ్దతలోకి పోయిందన్నారు. అవినీతి బాగా పెరిగిందని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్లలో సగం బిజెపి దక్కించుకుందనీ, ఆ రకంగా ఇచ్చిన వారికి రాయితీలు ఇచ్చిందని, వారి అవినీతి ఈ దెబ్బతో మాఫీ అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాదాన్ని పాతి పెట్టేందుకు అది శతవిధాలా ప్రయత్నిస్తోందని చెప్పారు. ఇదంతా కేవలం ట్రైలరే..అసలు సినిమా ముందుందంటూ చెబుతున్నారని గుర్తు చేశారు. అసలు సినిమా అంటే ఏమిటి? మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తిరిగి రైతులపై బలవంతంగా రుద్దుతారా..? నాలుగు లేబర్ కోడ్‌లను రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా అమలు జరిపి, కార్మికులపై భారం మోపుతారా? గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతులను అణచేస్తారా? సిఎఎను అమలు జరిపి, మైనార్టీలకు పౌరసత్వం లేకుండా, ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణిస్తారా..? ప్రజాస్వామిక హక్కులు కాలరాస్తారా? వన్‌నేషన్, వన్ ఎలక్షన్ ద్వారా ఏకవ్యక్తి పరిపాలనను అమలు చేస్తారా? చెప్పాలంటూ నిలదీశారు. వీటి కోసమే అయితే.. అలాంటి సినిమా మనకొద్దనీ, ఆ సినిమాను వదిలించుకోవడం మంచిదని సూచించారు. లేకపోతే దేశానికి భవిష్యత్తే లేదని ఆయన హెచ్చరించారు.

అలాగే సిపిఎం చూపే ప్రత్యామ్నాయ విధానాలను కూడా ప్రజలకు వివరించాలని రాఘవులు ఈ సందర్భంగా కోరారు. బిసిలకు కుల గణన కావాలి, అది చేయాల్సిన అవసముందని అన్నారు. 50 శాతం రిజర్వేషన్ సిలింగ్‌ను ఎత్తివేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలని కోరారు. మైనార్టీలకు, మహిళలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. 'ఉపా'లాంటి చట్టాల్ని ఎత్తేయాల్సిన అవసరముందని చెప్పారు. ఇలాంటి ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికతో సిపిఎం ప్రజల ముందుకు పోతోందని స్పష్టం చేశారు. మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలనీ, కార్మికులకు కనీస వేతనాలిచ్చి వారి కొనుగోలు శక్తి పెంచాలన్నారు. లౌకికత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే వారిని, అలాంటి వాటి కోసం పనిచేసే వారిని లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించాల్సిన అవసరముందని చెప్పారు. బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో భువనగిరి పార్లమెంట్‌లో సిపిఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ పోటీ చేస్తున్నారనీ, ఆయన్ను గెలిపించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని శాసన సభా, ఒక పార్లమెంట్ స్థానానికి సిపిఎం పోటీ చేస్తున్నదనీ, ఆయా స్థానాల్లో కూడా సిపిఎంను గెలిపించాలని రాఘవులు విజ్ఞప్తి చేశారు.

బుక్‌ను ఆవిష్కరిస్తున్న బివి రాఘవులు తదితరులు

వ్యక్తిత్వ వికాస సంపుటి కామన్ సెన్స్

- ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్

మాధురి వారణాసి రచించిన కామన్ సెన్స్ వ్యక్తిత్వ వికాస సంపుటి అని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఏల్లూరి శివా రెడ్డి అన్నారు. కామన్ సెన్స్‌కు తెలుగులో సరైన అర్థం ఇంగితం లేదా లోకజ్ఞతగా చెప్పవచ్చన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలో వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో మాధురి వారణాసి రచించిన కామన్ సెన్స్ గ్రంథ పరిచయ సదస్సు జరిగింది. దీనికి ఆచార్య శివా రెడ్డి హాజరై మాట్లాడుతూ.. వారణాసి ఇంటి పేరు అంత పవిత్రంగా కామన్ సెన్స్ గ్రంధం అంశాలు ఉన్నాయని ప్రశంసించారు. భార్యా భర్తలు సంబంధాలు దిగజారుతున్న నేటి కాలంలో బంధాల విలువలు నైతిక సంబంధాలు బోధించే కామన్ సెన్స్ గ్రంధం అర్థవంతంగా ఉందన్నారు. కేతవరపు రాజశ్రీ, భారతి రామచంద్రుని సరస్వతి కరవాది కూచి సాయిశంకర్ తదితరులు గ్రంధంలోని అంశాలు విశ్లేషణ చేశారు. వంశీ రామరాజు అధ్యక్షత వహించగా గ్రంథ రచయిత్రి మాధురి వారణాసి తొలి ప్రతిని రాధ వ్యాస కృష్ణ దంపతులకు అందజేశారు.

నోటీసులకు 15 రోజుల గడువు అడిగాం

- టిపిసిసి లీగల్ సెల్ ఇన్‌ఛార్జి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ పోలీసులు ఇచ్చిన నోటీసులకు 15 రోజుల్లో సమాధానమిస్తామనీ,ఈమేరకు తాము గడువు అడిగినట్టు టిపిసిసి లీగల్ సెల్ ఇన్‌ఛార్జి రామచంద్రారెడ్డి వెల్లడించారు. ఆ నోటీ సులను ఢిల్లీ ఇన్స్‌పెక్టర్ నీరజ్ చౌదరి ద్వారా గాంధీభవన్‌లో తానే అందుకున్నట్టు తెలిపారు. ఎఫ్ఐఆర్ పూర్తిగా చదివిన తర్వాత వాటిపై స్పందిస్తామన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బిజెపి నోటీసులు ఇచ్చిందని తెలిపారు. సోషల్ మీడియా వారియర్స్ తప్పు చేయబోరని తెలిపారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వడదెబ్బతో వృద్ధురాలు మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా మహమ్మద్‌నగర్ మండలం గిర్నీ తండాలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గిర్నీ తండా గ్రామానికి చెందిన కడవత్ హిరి (65) రెండు రోజులుగా తమ వరి ధాన్యాన్ని ఎండలో ఆరబెట్టి కుప్పలు చేసింది. ఈ క్రమంలో ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో తీవ్ర అస్వస్థతకు గురై సోమవారం రాత్రి ఆమె మృతి చెందింది.

సిఐటియులో చేరిన సిడబ్ల్యుసి హమాలీ కార్మికులు

- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : యూనియన్ నేతలు

ప్రజాశక్తి- హైదరాబాద్

సూర్యాపేట జిల్లా కేంద్రంలో సెంటర్ వేర్ హౌసింగ్ బోర్డుకు చెందిన దాదాపు 200 మంది హమాలీ కార్మికులు, సొసైటీ అధ్యక్షుడు సోమగాని బాలరాజు బిఆర్‌టియు (బిఆర్ఎస్ అనుబంధం)కు రాజీనామా చేసి సిఐటియులో చేరారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం రాంబాబు, కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు సమక్షంలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన, సౌకర్యాల కోసం హమాలీ హక్కులను ఐక్యం చేసి సిఐటియు పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వరంగ గిడ్డంగి సంస్థలను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అమ్ముతూ ప్రయివేట్ వ్యక్తులకు లాభాలు తెచ్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. దేశంలో కోట్లాది మంది హమాలీలు ఎగుమతి, దిగుమతి విభాగాల్లో పనిచేస్తున్నారని, వారి వల్ల ప్రభుత్వానికి, వ్యాపార సంస్థలకు ఆదాయం అందుతోందని చెప్పారు. కానీ, హమాలీలకు కనీసం ఉండటానికి ఇల్లు, పిల్లల చదువులకు ఆదాయం కూడా సరిపోవడంలేదని, సరైన వైద్యం అందడంలేదని తెలిపారు. హమాలీలను నాల్గో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హత ఉన్న వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా రూ. ఐదు వేల పింఛన్ ఇవ్వా లని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు హమా లీలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గిడ్డంగులను కాపాడాలని, ప్రయివేట్ వ్యక్తులకు గిడ్డంగుల నిర్వహణ బాధ్యత ఇవ్వొద్దని అన్నారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు సోమగాని బాలరాజు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చెరుకు యాకలక్ష్మీ, ఎం శేఖర్, వి సాయికుమార్, శేషగాని సైదులు, నరిగే జాణయ్య, అల్లాస్‌శ్యామ్, మొగిలి లింగయ్య, తొంటి వెంకన్న, లునావత్ శంకర్, కొమ్మగాని శేఖర్, నకిరేకంటి పరమేశ్, సోమగాని భిక్షం, వీరబోయిన నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు, కార్యదర్శుల సమక్షంలో యూనియన్‌లో చేరుతున్న హమాలీలు

పది ఫలితాల్లో గురుకులాల ప్రభంజనం

- ప్రయివేటు కంటే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ రంగంలోని గురుకుల పాఠశాలలు ప్రభంజనం సృష్టించాయి. ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచాయి. ప్రయివేటు పాఠశాలల కంటే మెరుగైన ఫలితాలు సాధించడం గమనార్హం. తెలంగాణ గురుకులాలు 98.71 శాతం ఉత్తీర్ణత సాధించి యాజమాన్యాల జాబితాలో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత బిసి గురుకులాలు 98.21 శాతం, ఎస్‌సి గురుకులాలు 98.02 శాతం, గిరిజన గురుకులాలు 97.16 శాతం, మైనార్టీ గురుకులాలు 96.82 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశాయి. ప్రయివేటు పాఠశాలల్లో 93.74 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో వెనుకంజలో ఉన్నాయి. జిల్లా పరిషత్ బడుల్లో 86.03 శాతం, ప్రభుత్వ పాఠశాలల్లో 80.18 శాతం ఉత్తీర్ణత వచ్చింది.

యాజమాన్యాల వారీగా ఉత్తీర్ణత వివరాలు

యాజమాన్యం	విద్యార్థుల హాజరు	ఉత్తీర్ణత	శాతం
తెలంగాణ గురుకుల	2,475	2,443	98.71
బిసి గురుకుల	17,467	17,154	98.21
ఎస్‌సి గురుకుల	18,063	17,706	98.02
గిరిజన గురుకుల	6,893	6,697	97.16
మైనార్టీ గురుకుల	10,076	9,756	96.82
మోడల్ స్కూళ్లు	17,592	16,723	95.06
ప్రయివేటు బడులు	2,29,043	2,14,712	93.74
కెజిబివి	17,546	16,329	93.06
ఆశ్రమ స్కూళ్లు	7,913	7,093	89.64
ఎయిడెడ్	6,526	5,783	88.61
జిల్లా పరిషత్	1,38,272	1,18,962	86.03
ప్రభుత్వ స్కూళ్లు	22,341	17,914	80.18
మొత్తం	4,94,207	4,51,272	91.31

11 లోక్‌సభ స్థానాలకు ఏఐసిసి పరిశీలకులు

- ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 11 లోక్‌సభ స్థానాలకు ఏఐసిసి పరిశీలకులను అధిష్టానం నియమించింది. ఈ మేరకు మంగళవారం జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు.

పరిశీలకులు వీరే...

1. మెదక్ - కుడి కున్నీల్ సురేష్
2. జహీరాబాద్ - రాజ్మోహన్ ఉన్నితన్
3. మహబూబ్ నగర్ - చంద్రశేఖర్
4. మల్కాజ్‌గిరి - జ్యోతి మణి
5. చేవెళ్ల - హిబ్బి ఏడెన్
6. ఆదిలాబాద్ - షఫీ పరంబిల్.
7. నిజామాబాద్ - బోస్ రాజు.
8. నాగర్ కర్నూల్ - పివి మోహన్.
9. సికింద్రాబాద్ - రిజ్వాన్ హర్షద్
10. వరంగల్ - రవీంద్ర దాల్వి
11. సికింద్రాబాద్ కంటోన్మెంట్ - పి విశ్వనాథన్

'సాహిత్యం మనుషులను కలుపుతుంది'

ప్రజాశక్తి - కల్చరల్

రాజకీయాలు మనుషులను విడదీస్తాయనీ, సాహిత్యం కలుపుతుందని ప్రముఖ అభ్యుదయ కవి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్‌వి సత్యనారాయణ అన్నారు. శ్రీత్యాగరాయ గానసభ కళా లలిత కళావేదిక పై జ్యోత్స్న కళా పీఠం నిర్వహణలో డాక్టర్ శరత్ జ్యోత్స్న రాణి రచనల ఆవిష్కరణ క్రోధి నామ ఉగాది పురస్కారాల ప్రదాన సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య సత్యనారాయణ పాల్గొనిపద్య కవిత్వంలో డాక్టర్ పోతుకూచి భట్టేశ్వర శర్మకు, వచన కవిత్వంలో జూపాక సుభద్రకు, సాంస్కృతిక రంగంలో వేలూరి రామకృష్ణరావుకు పురస్కారాలు బహుకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తన రచనలు సందేశంతో పాటు సామాజిక చైతన్యం కలిగించేందుకు మాత్రమే రచిస్తానని జ్యోత్స్న పేర్కొన్నారు.

మోడీ, షాకు నోటీసులివ్వాలి

- రేవంత్‌రెడ్డిని జైల్లో పెట్టేందుకు బిజెపి కుట్ర : నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బదులుగా రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు నోటీసులివ్వాలని ఢిల్లీ పోలీసులను సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ కోరారు. కేంద్రం ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే ఢిల్లీ, జార్ఖండ్ సిఎంలను ఇప్పటికే జైల్లో పెట్టారనీ, కొత్తగా రేవంత్ రెడ్డిని జైలులో పెట్టేందుకు బిజెపికి కుట్ర చేస్తోందని విమర్శించారు. ఆ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడే వారిని ఏదో పద్ధతిలో ఇబ్బందికి గురిచేస్తూ వారిని ఇరికించే ప్రయత్నం చేస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రత్యర్థులు లేకుండా బిజెపి కొత్త పన్నాగం పన్నుతోందని విమర్శించారు.

హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ పోలీసులు రేవంత్ రెడ్డికి నోటీసులు ఇవ్వడాన్ని ఖండించారు. బిజెపికి వ్యతిరేకంగా కర్నాటక, మహా రాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నా రనీ, ఆయన్ను నియంత్రించేందుకే నోటీసులు ఇచ్చారని చెప్పారు. ఇండియా కూటమి గెలిస్తే దేశానికి ప్రమాదమంటూ మోడీ చెప్పడం సరైంది కాదన్నారు. జాతి ఔన్నత్యానికి, లౌకికవాదానికి వ్యతిరేకంగా మోడీ, అమిత్ షా మాట్లడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అరెస్ట్ చేస్తే మోడీ పతనం మొదలవుతుందని చెప్పారు. ప్రధాని కక్షపూరితంగా వ్యవహరిస్తూ దిగజారి ప్రవర్తిసున్నారని నారాయణ ఈ సందర్భంగా విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత దిగజారిన ప్రధాని మరొకరు లేరన్నారు. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఉండబోదనీ, హిట్లర్ తరహాలో నియంతృత్వ పాలన వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి, ఎన్‌డిఎ భాగ స్వామ్య పార్టీలను పార్లమెంటు ఎన్నికల్లో ఓడిస్తా మని చెప్పారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఒక్క సీటూ రాబోదని అన్నారు. రాష్ట్రంలో ప్రమాదకర బిజెపి ఎదిగేందుకు బిఆర్ఎస్ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నర్సింహ పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

రెండో పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి

- తెలంగాణ యునైటెడ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 2023 జూలై 1 నుంచి రావాల్సిన రెండో పిఆర్‌సిని 40 శాతం ఫిట్మెంట్‌తో వెంటనే ప్రకటించి అమలు చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పిఆర్‌సి కమిషన్ ఆహ్వానం మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో ఆ కమిటీ చైర్మన్ ఎన్.శివశంకర్, సభ్యులు బి.రామయ్యను యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కలిసి చర్చించింది. గతంలో ఇచ్చిన పిఆర్‌సి నివేదికలో పేర్కొన్న అంశాలతో పాటు సమగ్ర నివేదికను కూలంకషంగా చర్చించి ఉద్యోగులకు న్యాయం చేయాలని బృంద సభ్యులు విజ్ఞప్తి చేశారు. కనీస వేతనం రూ. 30,400, గరిష్ట వేతనం రూ.2,58,980గా నిర్ణయించాలని, వైద్య ఆరోగ్యశాఖను మిగతా ప్రభుత్వ శాఖల మాదిరిగా చూడకూడదని వివరించారు. రిస్క్ అలవెన్స్‌తో పాటు మెరుగైన వేతన సవరణ చేయాలని విన్నవించారు. ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ పథకాన్ని ప్రతి ఐదేళ్లకోసారి ఇవ్వాలనీ, సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 30 శాతం, జిల్లా కేంద్రాల్లో 25 శాతం, ఇతర ప్రాంతాల్లో 20 శాతం హెచ్ఆర్ఎ ఇవ్వడంతో పాటు గ్రాట్యూటీ రూ.16 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అడిషనల్ హెచ్ఆర్ఎ వైద్య ఆరోగ్య ఉద్యోగులందరికీ వర్తింప చేయాలనీ, దశాబ్దాల తరబడి పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలనీ, ఖాళీ పోస్టులను శాశ్వత పద్ధతిలో భర్తీ చేసి పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులందనిని రెగ్యులర్ చేయడంతో పాటు అలవెన్స్‌లు వర్తింపజేయాలని కోరారు. అందరికీ ఆమోదయోగ్యమైన పిఆర్‌సిని రూపొందించి వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని ఈ సందర్భంగా యూనియన్ నాయకులకు చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యాద నాయక్,రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియుద్దీన్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బి.కిరణ్మయి, బైరపాక శ్రీనివాస్, జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ గోబెల్స్‌ను మించిపోయారు

- బిఆర్ఎస్ హయాంలోనే హాస్టళ్లు మూసివేత ప్రారంభం : సిఎం రేవంత్ ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ సిఎం కెసిఆర్ లేనిది ఉన్నట్టు ఉన్నది లేనట్టు చెప్పడంలో గోబెల్స్‌ను మించిపోయారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హాస్టళ్ల మూసివేత బిఆర్ఎస్ (మే, 2023) హయాంలోనే ప్రారంభమైందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఆ ప్రతిపాదన లేకపోయినా, ఉన్నట్టు కెసిఆర్ దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈమేరకు మంగళవారం ట్వీట్ చేశారు. మొన్న సూర్యాపేటలో, నిన్న మహబూబ్‌నగర్‌లో ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించిన తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న 2023 మేలోనూ యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ వేసవి సెలవులకు సంబంధించి, నెల రోజులపాటు హాస్టళ్లు, మెస్‌లు మూసివేయడం గురించి ఇలాంటి నోటీసునే జారీ చేసినట్టు తెలిపారు. (12-05-2023 నుంచి 05-06-2023 వరకు). అందులోనూ విద్యుత్, నీటి కొరతల గురించి ప్రస్తావించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చాకే యూనివర్సిటీ మూసేస్తున్నట్టు దిక్కుమాలిన దివాళా కోరు ప్రచారం చేయడం కెసిఆర్ దిగజారుడుతనానికి పరాకాష్ట అని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు అభినందనలు

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి వార్షిక ఫలితాల్లో 91.31 శాతం ఉత్తీర్ణత నమోదుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అభినందనలు తెలిపారు. సకాలంలో ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు ప్రకటించారు. యాజమాన్యాల వారీగా చూసినపుడు ఫలితాలు వాస్తవ పరిస్థితులకు అద్దంపట్టే విధంగా ఉన్నాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు రకాల గురుకులాలు ఈ ఫలితాల్లో పై మెట్టున ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక పరీక్షల ద్వారా ప్రవేశాలు చేపడుతున్నందున పై వరుసలో ఉన్నాయని వివరించారు. అన్ని యాజమాన్యాల్లో చేరిన తర్వాతే మిగిలిన విద్యార్థులు ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చేరుతున్నారని గుర్తు చేశారు. అందుకే ఆ పాఠశాలలు ఫలితాల్లో దిగువన ఉన్నాయని తెలిపారు. అయినా మంచి ఫలితాలు సాధించినట్టేనని పేర్కొన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో ఫలితాలు మెరుగ్గా కనిపిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో జీరో ఫలితాల్లేవని వివరించారు. వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు 3,927లో జిల్లా పరిషత్ పాఠశాలలు-1,347, కెజిబివిలు-177, మోడల్ స్కూళ్లు-60, ప్రభుత్వ పాఠశాలలు-37, ఆశ్రమ పాఠశాలలు-81, గురుకులాలు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఫలితాల స్ఫూర్తితో ప్రభుత్వరంగ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచుకోవాలని సూచించారు.

మరి ప్రధాని మోడీకి ఎందుకివ్వలేదు?

- సిఎం రేవంత్‌కు నోటీసులిచ్చారు సరే...
- విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోటీసులిచ్చారు సరే...రాజస్థాన్‌లో విద్వేషపూరిత ప్రసంగాలు చేసినందుకు మోడీకి ఎందుకివ్వలేదని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఉపన్యాసాలతో బిజెపి నేతల్లో దడ మొదలైందని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వ్యతిరేకం కాదంటూ ప్రకటన విడుదల చేయడానికి కారణం రాహుల్‌గాంధీ ఉపన్యాసమే కారణమని చెప్పారు. గాంధీ భవన్‌కు ఢిల్లీ పోలీసులు నోటీసులు తీసుకురావటం కూడా దీనిలో భాగమేనన్నారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీలు దీన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. మోడీ పదేండ్లుగా ప్రధానిగా ఉండి ఇన్ని అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రధాని హోదాలో మోడీ పుస్తెల మీద దిగజారుడు రాజకీయాలు చేస్తుంటే, ఆ పార్టీ నేతలే సిగ్గుతో తల దించుకోవాల్సి వస్తోందన్నారు. ఇన్ని రకాలుగా మోడీని అబద్ధాలు ప్రచారం చెయ్యమని నేర్పిస్తున్న వాళ్లు ఎవరని ప్రశ్నించారు. రాజస్థాన్‌లో మోడీ ప్రసంగం మీద ఎందుకు నోటీస్ ఇవ్వలేదని ఇసిని ఆయన నిలదీశారు. ఎన్నికల కమిషన్ డమ్మీగా మారిందని విమర్శించారు. కేంద్రంలో హంగ్ లేదు...బొంగు లేదు... కాంగ్రెస్‌దే విజయమన్నారు. కెసిఆర్ ఎండలకు ఆగం ఆగమైన ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

వేతన సవరణ బాండ్ల బకాయిలను వెంటనే చెల్లించాలి

- రవాణా శాఖ మంత్రికి ఎంప్లాయీస్ యూనియన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్ఆర్‌టిసి ఉద్యోగులందరికీ 2013 వేతన సవరణ బాండ్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఇ.వెంకన్న వినతి పత్రం అందించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ఆర్‌టిసి ఉద్యోగులకు రావాల్సిన వేతన సవరణ బాండ్లను వెంటనే చెల్లిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించి మూడు నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రూ. 281 కోట్లకు గాను కేవలం రూ.81 కోట్లు మాత్రమే చెల్లించారని గుర్తు చేశారు. సర్కార్ విడుదల చేసిన సొమ్ము కొంత మంది డ్రైవర్లకు మాత్రమే సరిపోయిందని తెలిపారు. మూడు నెలలుగా పలుమార్లు విజ్ఞప్తి చేసినా రేపు, మాపు అంటున్నారే తప్ప మిగతా సొమ్మును విడుదల చేయడం లేదని మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. సంస్థలో పని చేసే అన్ని కేటగిరీలకు చెందిన ఉద్యోగులకు 2013 వేతన సవరణ బాండ్ల డబ్బులను వెంటనే చెల్లించాలని కోరారు.

టెన్త్ ఫలితాల్లో నారాయణ విజయశంఖారావం

- 12.5 శాతం మందికి 10 జిపిఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి ఫలితాల్లో నారాయణ స్కూల్స్ విజయశంఖారావం పూరించాయి. ఈ మేరకు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఏడుగురిలో ఒకరికి పదికి పది జిపిఎ వచ్చిందని తెలిపారు. 12.5 శాతం మంది విద్యార్థులకు పదికి పది జిపిఎ సాధించారని పేర్కొన్నారు. 32,135 మంది విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ఏ గ్రేడ్ సాధించారని వివరించారు. సబ్జెక్టుల వారీగా 19,224 మంది విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించారని తెలిపారు. పదికి పది జిపిఎ, 9.8 ఆపైన సాధించిన విద్యార్థులు 1,707 మంది, 9.5 జీపీఏ ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు 43 శాతం ఉన్నారని పేర్కొన్నారు. 9.0 జీపీఏ ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు 65 శాతం ఉన్నారని తెలిపారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన బ్రాంచీలు 65 శాతం ఉన్నాయని వివరించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను తమ రోజువారీ సిలబస్‌లో భాగంగా బోధించడం ద్వారా నారాయణ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. నారాయణ సీవో, స్పార్క్, ఒలింపియాడ్, ఈ-టెక్నో, మెడిస్పార్క్ ప్రోగ్రామ్‌లతో బోధించడం కారణంగానే ఘనవిజయాలను సాధిస్తున్నామని తెలిపారు.